క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

బోథ్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఎంపీడీవో రమేశ్, ప్రత్యేక అధికారి వాజిద్ అలీ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో సరుకులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సీఎం కప్ క్రీడల నిర్వహణ సందర్భంగా మండల వ్యాప్తంగా పాల్గొన్న విద్యార్థులకు హాస్టల్‌లో భోజన వసతులు కల్పించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామారావు, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బోథ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని పుణ్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. దాదాపు 150 మొక్కలు నాటినట్లు ఎంపీడీవో తెలిపారు. నాటిన మొక్కలను బాధ్యతతో పెంచాలని విద్యార్థులకు సూచించారు. ఏపీఓ జాగ్దేరావు, హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆకస్మిక మృతి

ఇంద్రవెల్లి: మండలంలోని తుమ్మగూడకు చెందిన జుగ్నాక్ సుమన్‌బాయి (47) మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తిరిగివస్తుండగా అకస్మాత్తుగా స్పృహకోల్పోయింది. కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించే ప్రయత్నంలో గ్రామంలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త జుగ్నాక్ శంభు, కుమారుడు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కోలిపురకు చెందిన బాలిక (16) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన సదరు బాలిక ఇంటి వద్దే ఉంటోంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠం వద్ద జరుగుతున్న జాతరకు వెళ్తున్నానని చెప్పి మధ్యాహ్నం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

పంట క్షేత్రాల సందర్శన



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జైనథ్ మండలం కంఠ గ్రామంలో శనగ, కంది, మిర్చి పంట క్షేత్రాలను శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్, సునీల్‌కుమార్, శివచరణ్ మంగళవారం సందర్శించారు. ప్రస్తుతం శనగకు ఎండు తెగులు ఆశించినట్లు తెలిపారు. నివారణకు టేటుకొనజూల్, ట్రిఫ్లాక్సీట్రోబెల్ మొక్కల మొదళ్లలో పిచికారి చేయాలన్నారు. పచ్చపురుగు, లద్దెపురుగు నివారణకు ఇమమెక్టిన్‌బెంజైట్, నోవలురున్ పిచికారి చేయాలని సూచించారు. మిర్చిలో పురుగు తెగుళ్ల మందులతోపాటు బయో మందులు పిచికారి చేయాలన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. పట్టణంలోని బంగారుగూడ తెలుగు మీడియం పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి జవాబులను రాబట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరుపై ఆరా తీశారు. హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నక్షత్ర ఆస్పత్రిపై ఫిర్యాదు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని నక్షత్ర ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యంపై యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ నాయక్‌కు మంగళవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. వైద్యుడు సందీప్ ఐత్వార్ తన ఆస్పత్రిని వివిధ అర్హతలతో కూడిన వైద్యులు ఉన్నట్లుగా పర్మిషన్ తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని తెలిపారు. ఆదివాసీల నుంచి అందినకాడికి దండుకుంటున్నారన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరగా, హెల్త్ డైరెక్టర్ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారని ఆయన పేర్కొన్నారు.



గదిలో నిల్వ ఉన్న పుస్తకాలు

ఇరుకుగదిలో గ్రంథాలయం

- పాఠకులకు ఏకాగ్రత కరువు
- అదనపు విజ్ఞానానికి అవస్థలు

నేరడిగొండ: పాఠకులకు అదనపు విజ్ఞానం అందని ద్రాక్షగా మారింది. గ్రంథాలయం ఇరుకు గదిలో ఉండడంతో పాఠకులకు ఏకాగ్రత కొరవడింది. మండలకేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి సొంత భవనం కరువైంది. సొంత భవనం లేకపోవడంతో గ్రంథాలయం పాత గ్రామపంచాయతీ కార్యాలయానికి సంబంధించిన అదనపు గదుల్లో కొనసాగుతోంది. ఒక చిన్న గదిలో పుస్తకాలను నిల్వ చేసి మరో గదిలో పాఠకులకు చదివిస్తున్నారు. ఇరుకైన హాల్‌ను దినపత్రికల పఠనానికి వినియోగిస్తున్నారు. స్థలం లేకపోవడంతో టెలివిజన్‌ను వినియోగించడం లేదు. మండల కేంద్రంలో గ్రంథాలయం 1986లో మంజూరైంది. అప్పటి నుంచి గ్రంథాలయం అవస్థల మధ్యన కొనసాగుతోంది. ఎప్పుడో ఏళ్ల క్రితం సరఫరా చేసిన పుస్తకాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అందుబాటులో లేవు. గ్రంథాలయానికి సొంత భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, గ్రంథాలయానికి అన్నిరకాల పుస్తకాలను సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఈ గ్రంథాలయంలో దినపత్రికలు 10, వారపత్రికలు 8 ఉన్నాయి. 550 మంది పాఠకులు ప్రతిరోజు వస్తుంటారు. గ్రంథాలయంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



దినపత్రికలు చదువుతున్న పాఠకులు

సొంత భవనం నిర్మించాలి



గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇరుకు గదిలో కొనసాగుతోంది. దినపత్రికలు చదువుకోవడానికి ఇబ్బందిగా ఉంది. గ్రంథాలయానికి సొంత భవనం నిర్మిస్తే పాఠకులకు అనువుగా ఉంటుంది.

– నర్సింహా రెడ్డి, నేరడిగొండ

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. ఉద్యోగ వేటలో ఉన్న నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవసరమయ్యే పుస్తకాలను సరఫరా చేయాలి. సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– సోలంకి జగన్‌సింగ్, కిష్టాపూర్

స్థల సేకరణ చేస్తే..



స్థల సేకరణ చేస్తే ఉచిత భవన నిర్మాణం చేయడానికి నిధులు ఉన్నాయి. రాజారాం లైబ్రెరీ ఫౌండేషన్ ద్వారా నిధులు వస్తాయి. స్థలం చూపించడమే ఆలస్యం. భవన నిర్మాణం వెంటనే చేపడుతాం.

– శ్రీకాంత్‌రావు, గ్రంథాలయ అధికారి, నేరడిగొండ

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ ఆనవాళ్లను తొలగించేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజున విగ్రహాన్ని ఆవిష్కరించడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు అజయ్, రోకండ్ల రమేశ్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యూనుస్ అక్బాని, గోవర్ధన్, దాసరి రమేశ్, సాజిదొద్దిన్, జగదీశ్, స్వరూపరాణి, కరుణ, పర్వీన్, ప్రమీల పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, మాజీ సర్పంచ్ మడావి రూప్‌దేవ్, నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మండల కోఆర్డినేటర్ సుఫీయన్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మీర్జా జీలానిబేగ్, మాజీ ఎంపీటీసీ మడావి భీంరావ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాంనివాస్, నాయకులు ఉన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు జనార్దన్, ప్రభాకర్, చందు, సుకుమార్, శ్రీనివాస్, వినోద్, భువనచందర్, సాయి త్రిలోక్, మిన్ను, రవి పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ డాక్టర్ సంధ్యరాణి, బోథ్, నేరడిగొండ మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్ మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పలు మండలాల నాయకులు తరలివచ్చి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు శివారెడ్డి, అంబేకర్ పండరి, సాబ్లే ప్రతాప్ సింగ్, రాథోడ్ సురేందర్, దేవేందర్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, పాండు, కృష్ణారెడ్డి, సుభాష్, నానక్‌సింగ్ పాల్గొన్నారు.



నార్నూర్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ఇంద్రవెల్లి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు

ఇచ్చోడ: పార్టీకోసం కష్టపడి పనిచేసేవారికి కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తెలిపారు. ఇచ్చోడ మార్కెట్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన మార్కెట్ చైర్‌పర్సన్ కుంర సత్యవతి కోటేశ్వర్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం ఆమెను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్టత కోసం ప్రతి కార్యకర్తలు పనిచేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పంచాయతీ నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ అన్ని సీట్లు గెలిపించుకోవాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు మహిమూద్ ఖాన్, పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తాఫా, షాదుల్ల, సిరిచెల్మ మాజీ సర్పంచ్ అజీంసుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను చూసే కాంగ్రెస్‌లో చేరికలు

నేరడిగొండ: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో వడూర్ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కళ్లెం రామకృష్ణకు కండువా కప్పారు. బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, యూత్ అధ్యక్షుడు పోతారెడ్డి, నాయకులు పాల శంకర్, కుంట శంకర్, నవీన్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ తీసుకెళ్లాలి

తలమడుగు: ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని ఉండం గ్రామంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీలు గోక గణేశ్‌రెడ్డి, నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు బొడ్డు గంగారెడ్డి, కోటేశ్, మాజీ ఎంపీపీలు కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, ఆడే శీల, శ్రీధర్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సరస్వతినగర్‌లో గల ప్రభుత్వ బాలికల పాఠశాలలో పోషకాలపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రుతుక్రమ శుభ్రత, ఆరోగ్యం, తదితర వాటి గురించి వారికి వివరించారు. పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ యశోద

మండలస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో సాయన్న, తదితరులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించేందుకు సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో సాయన్న తెలిపారు. మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఎంఈవో రాథోడ్ మానుకుమార్, ఎస్సై సునీల్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఈవో సంజీవ్‌రావు, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాంసి: తాంసి జెడ్పీ పాఠశాల ఆవరణలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను మండల అధికారులతో కలిసి ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి ప్రారంభించారు. డీటీ జాదవ్ గణేశ్, ఎంఈవో శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాఘవేంద్ర, లీల తదితరులు ఉన్నారు. అదేవిధంగా భీంపూర్ మండలం అందర్‌బంద్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో ఈ పోటీలను మండల ప్రత్యేకాధికారి కిషన్ ప్రారంభించారు. ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ నలందప్రియ, ఎంఈవో శ్యాముందర్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల మినీ స్టేడియంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలను డీసీవో మోహన్ ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, కోకో క్రీడల్లో బాలురు, బాలికల విభాగంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై అప్పారావ్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడ: జెడ్పీ పాఠశాల ఆవరణలో మండల సీఎం కప్ క్రీడా పోటీలను క్రీడ పోటీల కన్వీనర్ ఎంపీడీవో లక్ష్మణ్ ప్రారంభించారు. ఎంఈవో బిక్కు ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రసాద్, తహసీల్దార్ సత్యనారాయణ్‌రావు, పీడీ రామేశ్వర్, పీఈటీ మోహన్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



తాంసిలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

బేల: స్థానిక జెడ్పీ సెకండరీ పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను మండల ప్రత్యేక అధికారి మనోహర్‌రావు, ఎంఈవో నర్సింలు ప్రారంభించారు. తహసీల్దార్ కొట్నాక రఘునాథ్‌రావు, ఎంపీడీవో మహేందర్‌కుమార్, హెచ్‌ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

రేపు క్రీడాపోటీలు ప్రారంభం

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్ లాల్ తెలిపారు. క్రీడా మైదానాన్ని పీఈటీలతో కలిసి మంగళవారం పరిశీలించారు. బుధవారం పంచాయతీ స్థాయి క్రీడా పోటీలు ఉంటాయన్నారు. పీడీ విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి మోతిరామ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కైలాస్‌నగర్: ఆడబిడ్డ పెళ్లికి తల్లిదండ్రులు పడే కష్టమేంటో తండ్రిగా తనకు తెలుసని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలకు చెందిన 191 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.అధికారులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

ఎదులాపురం: హక్కులు లేని సమాజం బానిసత్వానికి మూలమని సార్క్ నేషన్స్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ గుర్రం పున్నం రావు అన్నారు. జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. రాజుసిద్ధార్థ, లక్ష్మణ్, శ్రీనివాస్, అజయ్, నరేశ్ పాల్గొన్నారు.

సమ్మెలో సిబ్బంది.. విద్యార్థినులు ఆటకు దూరం

తాంసి: తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగారు. తాంసి కేజీబీవీ సిబ్బంది సమ్మెలో ఉండడం, స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో జరిగిన సీఎం కప్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు పాల్గొనలేదు. కేజీబీవీ భవనంపై నుంచి క్రీడాపోటీలను చూశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో కుష్ఠువ్యాధి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. హెల్త్ అసిస్టెంట్లు సాయన్న, శ్రీ నివాస్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ ఉన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పాలి

బజార్‌హత్నూర్: టీచర్లు, తల్లిదండ్రులు విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పాలని టీజీబీ బ్యాంక్ మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం పోషకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. హెచ్‌ఎం వొర్ని వెంకటరమణ, రాజన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో కేరళ అర్చకుడు పూజలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కేరళ ఆలయ అర్చకుడు మురళి నంబుద్రి గురుస్వామి మంగళవారం పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ను భక్తులు సన్మానించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఎదులాపురం: నిజామాబాద్‌లోని ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహిస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు పార్టీ) రాష్ట్ర ప్రథమ మహాసభలు విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా కార్యదర్శి సయ్యద్ మహిమూద్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అరుణ, రాము, విజయ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం జైనథ్‌లో మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో అన్ని వసతుల కల్పిస్తామన్నారు. వైస్ చైర్మన్ విలాస్, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి మధుకర్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేత

బోథ్: సొనాల జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులకు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం 40 స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు.

శిశు మందిరాలు సాంస్కృతిక నిలయాలు

నేరడిగొండ: శిశుమందిరాలు సాంస్కృతిక నిలయాలని విభాగ్ కార్యదర్శి కట్టా నాగాచారి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో పోషకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం రావాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను శిశు మందిర్‌లో చేర్పించాలన్నారు. రాజనర్సయ్య, గోవర్దన్, మీన పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం

నేరడిగొండ: జిల్లా కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ జ్యోతి, కోశాధికారిగా ఉదయ్‌కిరణ్, ఉపాధ్యక్షులుగా వెండి కిశోర్, శివలీల, కార్యదర్శులుగా రాథోడ్ ఈశ్వర్, రుఖియా తన్వీర్, షాహిన్ కౌసర్, మహిళా కన్వీనర్‌గా వసంత ఎన్నికయ్యారు.

మధ్యాహ్న కార్మికులు తరలిరావాలి

ఎదులాపురం: కలెక్టరేట్ ఎదుట బుధవారం చేపట్టే నిరసన కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికుల కార్మికులు తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు కోరారు. జిల్లా కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

ఎదులాపురం: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అర్బాత్ ఖాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తమను గెలిపించినవారందరికి ధన్యవాదాలు తెలిపారు. నాహిద్, అశోక్, సుగత్ కుమార్, ముస్తఫా ఉన్నారు.

అటాచ్డ్‌గా ఉన్న హెచ్‌సీల రిలీవ్



రిలీవ్ అయిన హెచ్‌సీలను సన్మానిస్తున్న డీఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: రెండేళ్ల క్రితం హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది జిల్లాలోని ఆయా స్టేషన్లలో అటాచ్డ్‌గా పనిచేస్తున్న 48 మంది సోమవారం రిలీవ్ అయ్యారు. జిల్లాలో కానిస్టేబుళ్లుగా పనిచేసి వారు పదోన్నతి పొందగా, అప్పట్లో పోలీసుల ఖాళీలు ఏర్పడడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు ఇక్కడే కొనసాగారు. ఇటీవల పోలీస్ కొత్త బ్యాచ్ రావడంతో నిజామాబాద్, జిల్లాల్లో పదోన్నతి పొందిన వారిని రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి వారిని సన్మానించారు.

సన్మానం

తాంసి: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన అశోక్‌ను నాయకులు మంగళవారం సన్మానించారు. తలమడుగు మండలం ఉండం గ్రామంలో జరిగిన సమావేశంలో అశోక్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, నాయకులు అభినందించారు.

టీచర్ కోసం ఎదురుచూపు

నార్నూర్: గాదిగూడ మండలం అర్జుని పంచాయతీ పరిధిలో రామగూడ గ్రామంలోని టీడబ్ల్యూపీఎస్ ఉపాధ్యాయుడు రాథోడ్ బాబూలాల్ అనారోగ్యంతో మూడు రోజులు సెలవుపై వెళ్లారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉండడంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మంగళవారం సదరు టీచర్ సెలవులో ఉండడంతో పాఠశాల తెరుచుకోలేదు. టీచర్ కోసం విద్యార్థులు ఎదురుచూశారు. ఎంతకీ రాకపోవడంతో తిరిగివెళ్లారు.

మైక్‌సెట్ అందజేత

బోథ్: బోథ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బాలికల)కు హైదరాబాద్‌లోని విద్యాధన్ ఆర్గనైజేషన్ ట్రస్ట్ కోఆర్డినేటర్ మనోహర్ యాదవ్ మంగళవారం మైక్‌సెట్, గ్రీన్ చాక్ బోర్డును అందజేశారు. హెచ్‌ఎం సత్యనారాయణ, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్‌లు ఆయన్ను సన్మానించారు. ఉపాధ్యాయులు బైరి సతీశ్‌కుమార్, అనసూయ, సవిత, విద్యార్థులు పాల్గొన్నారు.